మాలమాదిగలు మానవత్వంతో మెలగాలి

ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

గోరటి వెంకన్న

ఖైరతాబాద్, డిసెంబర్ 6 : మాలమాదిగలు మనువాదం, మౌఢ్యం, వర్ణవ్యవస్థ, కర్మసిద్ధాంతాన్ని రూపుమాపి మానవతత్వంతో మెలగాలని ఎమ్మెల్సీ, కవి, గాయకుడు గోరంటి వెంకన్న సూచించారు. దళిత ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత వర్గాలు జ్ఞానపరమైన సమాజమని, వారి మధ్య విద్వేషాలు తగవని పేర్కొన్నారు. మాలమాదిగల్లో ఎందరో మహానుభావులు ఉన్నారని, వర్గీకరణ విషయంలో ప్రజాస్వామికవాదులు, మానవీయ దృక్పథం ఉన్నవారు అన్ని సంఘాలను భాగస్వామ్యం చేసి ప్రభుత్వంతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. దళిత ఇంటలెక్చువల్ ఫోరం ప్రతినిధి డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు తాము వ్యతిరేకం కాదని, కొందరు మాలలను మనువాదులు అనడం సరికాదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర అన్ని వర్గాల్లో మనువాదులు ఉన్నారని, ఏకపక్షంగా ఒక కులాన్ని టార్గెట్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ కుమారస్వామి, ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇక బెనిఫిట్ షోలు బంద్

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): పుష్ప సినిమా బెనిఫిట్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోవడం బాధాకరమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇకపై తెలంగాణలో ఎంత పెద్ద సినిమాకైనా బెనిఫిట్ షోలు, ఎర్లీ మార్నింగ్, మిడ్‌నైట్ షోలకు అనుమతులు ఇవ్వబోమని శుక్రవారం ఆయన స్పష్టంచేశారు. మహిళ మృతిపై హీరో, చిత్ర యూనిట్ స్పందించకపోవ డం బాధాకరమని అన్నారు.

కేసీఆర్ దార్శనికతకు నిదర్శనం వైటీపీఎస్

- తెలంగాణ చరిత్రపై చెరగని కేసీఆర్ మరో సంతకమే యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్
- ఇది ప్రజలకు చిరకాలం గుర్తుంటుంది
- కేసీఆర్ ఆనవాళ్లు ఎవరూ చెరిపేయలేరు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): నిత్యం కరెంట్ కోతలు, వారానికి రెండు రోజుల పవర్ హాలీడేల దుస్థితి నుంచి అన్ని రంగాలకు 24 గంటల నిరంతర విద్యుత్తు సరఫరా చేసేలా తెలంగాణను తీర్చిదిద్దిన కేసీఆర్ దార్శనితకకు నిదర్శనమే యాదాద్రి పవర్ ప్లాంట్ అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. నల్లగొండ జిల్లాలో శనివారం ప్రభుత్వం ప్రారంభించబోయే యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎ) నిర్మాణం వెనుక ఉన్న కేసీఆర్ కృషి, దార్శనికత తెలంగాణ ప్రజలకు చిరకాలం గుర్తుంటుందని శుక్రవారం ఎక్స్ వేదికగా తెలిపారు. కేసీఆర్ దీర్ఘదృష్టికి, భారీ ప్రాజెక్టులను పూర్తిచేయడంలో అనితరసాధ్యమైన వేగానికి యాదాద్రి థర్మల్ వైటీపీఎస్ మరో ఉదాహరణ అని పేర్కొన్నారు. వైటీపీఎస్ పూర్తి సామర్థ్యం 4000 మెగావాట్లు (5x800) అని, స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఒక రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో ఉన్న అతిపెద్ద థర్మల్ పవర్ ప్లాంట్ ఇదేనని వెల్లడించారు. వైటీపీఎస్ నిర్మాణాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీహెచ్ఈఎల్ (భెల్) సంస్థకు అప్పగించిందని, దాదాపు రూ.20,400 కోట్ల విలువైన ఆర్డర్, భారత విద్యుత్తు రంగ చరిత్రలో ఒక ప్రభుత్వ రంగ సంస్థకు ఇచ్చిన అత్యంత విలువైన ఆర్డర్‌గా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయడం ఎవరితరమూ కాదని కేటీఆర్ మరోమారు స్పష్టంచేశారు. 2014లో కేవలం 7,778 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం మాత్రమే ఉండగా, బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంలో తెలంగాణలో స్థాపిత సామర్థ్యాన్ని దాదాపు 20,000 మెగావాట్లకు చేర్చిందని గుర్తుచేశారు. ఇది దేశ చరిత్రలో ఎన్నడూ చూడని విజయగాథ అని, ఇది తెలంగాణ చరిత్రపై కేసీఆర్ చేసిన చెరగని సంతకమని కొనియాడారు.

తెలంగాణ అభివృద్ధే నా లక్ష్యం

తాను మంత్రిగా ఉన్నా లేకున్నా తన రాష్ట్రం తెలంగాణ అని, దాని అభివృద్ధి కోసం ప్రయత్నిస్తూనే ఉంటానని కేటీఆర్ స్పందించారు. ఎక్స్ వేదికగా తెలంగాణకు చెందిన ఓ నెటిజన్ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. 'మీరు నిజమైన నాయకుడు. తెలంగాణను మీకంటే బాగా ప్రమోట్ చేయగల వ్యక్తి లేరు. కేరళలో నిన్న జరిగిన టైకాన్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో మీ మాటలు విన్నప్పుడు మీరు ఇంకా మా ఐటీ, పరిశ్రమల మంత్రిగానే ఉన్నారనిపించింది. మీరు త్వరలోనే తిరిగి అధికారంలోకి వచ్చి తెలంగాణను మరింత అభివృద్ధి పరుస్తారని ఆశిస్తున్నాను' అని నెటిజన్ ఎక్స్‌లో పోస్టుచేయగా కేటీఆర్ ప్రతిస్పందించారు. 'నేను మంత్రిగా ఉన్నా లేకపోయినా తెలంగాణ నా రాష్ట్రం. నేను ఎక్కడ ఉన్నా తెలంగాణను ప్రమోట్ చేస్తూనే ఉంటాను. మీ ఆప్యాయమైన వ్యాఖ్యలను ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

కేసీఆర్ పాలనను మిస్సవుతున్న ప్రజలు!

కేసీఆర్ పాలనను ప్రజలు మరింతగా మిస్సవుతున్నారన్న భావన కలుగుతున్నదని కేటీఆర్ పేర్కొన్నారు. ఇందుకు ఓ తండ్రి తనకు అందించిన లేఖనే ఉదాహరణ అని తెలిపారు. 'నిన్న కేరళలోని కొచ్చి నుంచి తిరిగి వస్తున్నప్పుడు, ఏయిర్ హోస్టెస్ ఒక ప్రయాణికుడి నుంచి వచ్చిన లేఖను నాకు అందించారు. ఆ వ్యక్తి తన కుమారుడు డాక్టర్ అవ్వడానికి కారణం కేసీఆర్ ప్రభుత్వం ప్రతి జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల స్థాపించడమే. ఇందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలపాలని కోరుతూ లేఖ రాశారు' అని కేటీఆర్ వివరించారు. క్యూట్ బాయ్ విరాట్ తన దగ్గరకు వచ్చి, ఒక ఫొటో తీసుకొని కేసీఆర్ తాతకు తన ప్రేమను తెలియజేయాలని కోరినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన రెండు ఫొటోలను ఎక్స్‌లో కేటీఆర్ పోస్టు చేశారు.

యాదాద్రి విద్యుత్తేజం.. కల సాకారం

మొదటిపేజీ తరువాయి...

ఐదు యూనిట్లు మొత్తంగా నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. విద్యుత్తు ఉత్పత్తికి కావాల్సిన నీటిని కృష్ణా నది నుంచి తీసుకునేందుకు పైపులైన్‌తోపాటు బొగ్గు రవాణా కోసం సమీపంలో జాన్‌పహాడ్ రైల్వే క్రాసింగ్ నుంచి ప్లాంట్ వరకు ఎనిమిది కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణం చేపట్టారు. ప్లాంట్‌కు సంబంధించిన పనులన్నీ బీఆర్‌ఎస్ హయాంలోనే 90% మేరకు పూర్తయ్యాయి.

అడుగడుగునా అనేక సవాళ్లు

విద్యుత్తు ప్లాంట్ నిర్మాణ పనులను అడ్డుకునేందుకు అటు కేంద్రం, ఇటు పొరుగు రాష్ట్రంతోపాటు అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు అనేక విధాలుగా ప్రయత్నించారు. ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణను అడ్డుకునేందుకు స్థానిక నేతలు అనేక రకాలుగా యత్నించారు. నిర్వాసితులను రెచ్చగొట్టాలని చూశారు. భూనిర్వాసితులకు నాడు కేసీఆర్ ప్రభుత్వం నచ్చజెప్పి, డిమాండ్ మేరకు నష్టపరిహారం అందించి అన్నివిధాలుగా వసతులు కల్పించి ఆదుకోవడంతో వారి ఆటలు సాగలేదు. అటు తరువాత కరోనా సమయంలో పది వేల మంది కార్మికులు తమతమ రాష్ట్రాలకు వెళ్లిపోవడంతో ప్లాంట్ పనులు రెండేండ్లు నిలిచిపోయాయి. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, పనులను తిరిగి పట్టాలెక్కించింది. పనులు తుది దశకు చేరుకుంటున్న తరుణంలో మళ్లీ కొందరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో ప్లాంట్‌లో విద్యుత్తు ఉత్పత్తికి అడ్డంకి ఏర్పడింది. పర్యావరణ నిబంధనల మేరకే అనుమతులన్నీ తీసుకున్నప్పటికీ, దాదాపు తుది దశకు చేరుకునే క్రమంలో ప్లాంట్‌పై మళ్లీ అధ్యయనం చేయాలని గ్రీన్‌ట్రిబ్యునల్ మెలికలు పెట్టింది. ఆయా న్యాయవేదికలపై బీఆర్‌ఎస్ సర్కారు బలమైన వాదనలు వినిపించింది. అడ్డంకులు తొలగించేందుకు విశేష కృషి చేసింది. కేసీఆర్ హయాంలోనే పనులన్నీ పూర్తి చేసుకున్న ప్లాంట్ ఇప్పుడు ప్రారంభానికి సిద్ధమైంది.

నేడు యూనిట్ 2 ప్రారంభం

దామరచర్లలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో మొత్తంగా ఐదు యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్ సామర్థ్యం 800 మెగావాట్లు. ఇందులో ఇప్పటికే 1, 2వ యూనిట్లను ఒకేసారి లైటప్ చేశారు. సింక్రనైజేషన్ కూడా ప్రారంభం కాగా, రోజుకు కొంత విద్యుత్తు ఉత్పత్తి ప్రారంభమైంది. ఇటీవలనే సింక్రనైజేషన్‌లో భాగంగా పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు ఆయా యూనిట్లలో విద్యుత్తు ఉత్పత్తి విజయవంతంగా పూర్తయింది. శనివారం నుంచి కమర్షియల్ ఆపరేషన్ ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్లాంట్‌లోని యూనిట్ 2ను శనివారం ప్రారంభించనున్నారు. 72 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్తు ఉత్పత్తి కొనసాగిన అనంతరం యూనిట్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు. త్వరలోనే ఈ ప్లాంట్ నుంచి 1600 మెగావాట్ల విద్యుత్తు గ్రిడ్‌తో అనుసంధానం కానున్నది.

ఇక యాదాద్రియే ఆశాదీపం

వివిధ రాష్ట్రాలు, సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు ముగియనున్న తరుణంలో ఆ లోటును భర్తీ చేసేందుకు యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ ఆశాదీపం కానున్నది. రాష్ట్ర విద్యుత్తు అవసరాలను తీర్చేందుకు ఇతర రాష్ట్రాల్లోని పవర్‌ప్లాంట్లతో చేసుకున్న ఒప్పందాల గడువు సమీపిస్తున్నది. కీలక అగ్రిమెంట్లు రానున్న రెండు మూడేండ్లలో ముగియనున్నాయి. 2024-25లో 2,284 మెగావాట్లు, 2025-26లో 2,400 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు ముగుస్తాయి. వాటితోపాటు మరో 2,899 మెగావాట్ల సోలార్ విద్యుత్తు వినియోగ ఒప్పందాలు సైతం ముగియనున్నాయి. రామగుండం యూనిట్-7కు చెందిన 87.76 మెగావాట్ల ఒప్పందం 2026-27లో ముగియనున్నది. 2028-29లో 583.9 మెగావాట్ల సింహాద్రి ఒకటో దశ ఒప్పందం ముగియనుండగా, అదే ఏడాదిలో వెయ్యి మెగావాట్ల ఛత్తీస్‌గఢ్ ఒప్పందం గడువు సైతం 2028-29లో పూర్తికానున్నది. రానున్న పదేండ్లలో మొత్తంగా 4,684 మెగావాట్ల పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ల గడువు ముగియనున్నది. సరిగ్గా విద్యుత్తులోటు ఏర్పడే ఆ సమయంలోనే యాదాద్రి పవర్‌ప్లాంట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుండటం విశేషం. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్తును కొనుగోలు చేసే పరిస్థితి తప్పనున్నది. 2025 -26 కల్లా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని అన్ని యూనిట్లు అందుబాటులోకి వస్తాయి.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రిమాండ్ తిరస్కరణ

- ఫిబ్రవరి 2న కోర్టుకు హాజరుకావాలని జడ్జి సూచన
- పోలీసుల వైఫల్యంతో ప్రభుత్వానికి చుక్కెదురు

నాంపల్లి కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి రిమాండ్ విధించాలన్న విజ్ఞప్తిని నాంపల్లి కోర్టు తిరస్కరించింది. పోలీస్ అధికారిని బెదిరించినట్టు, ఆయన విధులకు ఆటం కం కలిగించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కౌశిక్‌రెడ్డిని గురువారం రాత్రి పోలీసులు 3వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. కౌశిక్‌రెడ్డిపై వచ్చిన అభియోగాలకు, ఆయనపై పోలీసులు నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేదని బీఆర్‌ఎస్ లీగల్‌సెల్ న్యాయవాదులు జడ్జికి తెలిపారు. ఏడేండ్లలోపు శిక్ష పడే అవకాశం ఉన్న ఈ కేసులో నిందితుడికి బీఎన్‌ఎస్‌ఎస్‌లోని 35(2) సెక్షన్ (గతంలో సీఆర్‌పీసీ 41ఏ సెక్షన్) ప్రకారం నోటీసులు ఇవ్వకుండా రిమాండ్‌కు తరలించడం చట్టవిరుద్ధమని వివరించారు. ఈ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి.. పోలీసుల రిమాండ్ రిపోర్టును తిరస్కరించారు. రూ.5 వేల చొప్పున ఇద్దరి జమానత్‌లను సమర్పించాలని కౌశిక్‌రెడ్డిని ఆదేశించారు. ఆ ఆదేశాల మేరకు కౌశిక్‌రెడ్డి శుక్రవా రం తన న్యాయవాది జక్కుల లక్ష్మణ్ ద్వారా ఇద్దరి జమానత్‌లను కోర్టుకు సమర్పించడం తో.. ఫిబ్రవరి 2న కోర్టుకు హాజరుకావాలని న్యాయమూర్తి కౌశిక్‌రెడ్డికి సూచించారు. దీం తో బీఆర్‌ఎస్ నేతలపై తప్పుడు కేసులు బనాయించి, జైలుకు తరలించాలని చూస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారుకు దిమ్మతిరిగే షాక్ తగిలింది.

పోలీస్ కస్టడీకి పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, డిసెంబరు 6: లగచర్ల ఘటనపై విచారణ నిమిత్తం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు కస్టడీలోకి తీసుకునేందుకు కోర్టు అనుమతించింది. ఈ కేసులో ఇప్పటికే నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసి, జైలుకు తరలించిన పోలీసులు.. విచారణ నిమిత్తం ఆయనను తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం కొడంగల్ కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. అనంతరం రెండ్రోజులపాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తున్నట్టు ప్రకటించిన కోర్టు.. నరేందర్‌రెడ్డిని ఆయన న్యాయవాది సమక్షంలో విచారించాలని ఆదేశించింది.

హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి

రేవంత్‌రెడ్డి వైఖరిని ప్రజల్లో ఎండగట్టాలి:ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబర్6 (నమస్తే తెలంగాణ): బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా ప్రశ్నించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నందినగర్‌లోని తన నివాసంలో ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన జాగృతి నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ అధికారం కోసం రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ తప్పుడు హామీలిచ్చారని మండిపడ్డారు. యువవికాసం కింద విద్యార్థులకు రూ. 5లక్షల విద్యాభరోసా కార్డులిస్తామని చెప్పి ఓట్లు దండుకొని ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. రూ. 3లక్షల్లోపు ఆదాయం ఉన్న బీసీ కుటుంబాల పిల్లలకు 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్పి దగా చేశారని విరుచుకుపడ్డారు. మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆ మాటే మరిచిపోయారని విమర్శించారు. 18 ఏండ్లు నిండిన విద్యార్థినులకు స్కూటీలు కొనిస్తామని ఇచ్చిన హామీని గాలికొదిలేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

శైలజ కుటుంబానికి 2లక్షల పరిహారం : కవిత

హైదరాబాద్, డిసెంబర్6 (నమస్తే తెలంగాణ): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా మృతిచెందిన శైలజ కుటుంబానికి తెలంగాణ జాగృతి అండగా నిలిచింది. బాధిత కుటుంబానికి శుక్రవారం జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత రూ. 2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. శైలజ కుటుంబం దయనీయ పరిస్థితిని ఆసిఫాబాద్ జిల్లా జాగృతి నాయకుడు పార్శ చంద్రశేఖర్ ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శైలజ కుటుంబానికి రూ. 2లక్షలు అం దించాలని ఆమె నిర్ణయించారు. అలాగే త్వరలోనే వాంకిడిలో పర్యటిస్తానని పే ర్కొన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఇంటిని నిర్మించి ఇవ్వడంతో పాటు బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, పక్కన జడ్పీ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి, బీఆర్‌ఎస్ నాయకులు

ఆరు గ్యారెంటీల అమలులో సర్కారు విఫలం

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మహదేవపూర్(కాటారం), డిసెంబర్ 6: ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపించారు. శుక్రవారం కాంగ్రెస్ వంచన దినాల్లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రధాన రహదారిపై పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలతోపాటు 420 హామీలను ఇచ్చి విస్మరించిందన్నారు. ఏం సాధించిందని విజయోత్సవాలు నిర్వహిస్తున్నదని ప్రశ్నించారు. రూ.2లక్షల రుణం మాఫీ కొందరికే మాఫీ చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. కేసీఆర్ సర్కారు హయాంలో సంతోషంగా ఉన్న రైతులకు నేడు కాంగ్రెస్ ప్రభుత్వం శాపంగా మారిందని చెప్పారు. రూ.100 కోట్లతో పెద్దపల్లిలో సభ పెట్టి రాష్ట్రంలో అందరూ సంతోషంగా ఉన్నారని చెప్పి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు.

రాజన్న కోడెలు కోతకు?!

I తరువాయి...

ఎండార్స్‌మెంట్‌చేసి సిఫారసు చేశారు. ఈ సిఫారసును పరిగణనలోకి తీసుకోవాలని దేవాలయ ఈవోను లేఖలో అదేశించారు. ఈ లేఖను రాంబాబు ఆలయ అధికారులకు ఇవ్వడంతో అతడు రైతా? కాదా? అతనికి గోశాల ఉన్నదా? లేదా? నిజంగా ఆయనకు కోడెలు అవసరం ఉన్నాయా? లేవా? అన్న వివరాలేవీ తెలుసుకోకుండానే కోడెలు అప్పజెప్పిట్టు విమర్శలు వస్తున్నాయి. రాంబాబు వ్యవహారాన్ని గుర్తించిన ఆ ప్రాంతానికి చెందిన కొందరు యువకులు, గత నెల 29న గీసుగొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాదాసి రాంబాబుపై కేసు నమోదు చేసినట్టు సీఐ మహేందర్ ఈ నెల 6న తెలిపారు. యువకుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని, అతడు అలయం నుంచి 60 కోడెలు తెస్తే వాటిలో 11 మాత్రమే ఉన్నాయని, మిగిలిన 49 లేకపోవంతో కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయంపై వేములవాడ ఆలయ దేవాదాయ శాఖ అధికారులను వివరణ కోరుతూ లేఖ రాసినట్టు వెల్లడించారు. కేసు విషయం వెలుగు చూడడంతో ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ అయింది. వీటిన్నింటిని వివరిస్తూ 'రాజన్న కోడెల దుర్వినియోగం!' శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ' జిల్లా పేజీలో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో వేములవాడ ఆలయ ఈవో శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాంబాబుకు అక్టోబర్ 4న రెండు కోడెలు మాత్రమే ఇచ్చినట్టు పేర్కొన్నారు. పత్రాలు పరిశీలించిన తర్వాతే ఇచ్చామని చెప్పిన ఈవో, ఇదే తరహాలో గీసుగొండ, మనుగొండ, అనంతారం, చలపర్తి, దుగ్గొండి, వరంగల్‌లోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు సైతం ఇచ్చామని తెలిపారు. అక్టోబర్ 4 నుంచి 13 వరకు పంపిణీ చేశామని పేర్కొన్నారు. 'నమస్తే' కథనంపై విచారణ చేపట్టి తగుచర్యలు తీసుకుంటామని, ఇకముందు కోడెలను పంపిణీ చేసే సమయంలో మరింత కఠినంగా వ్యవహరిస్తామని, రికార్డుల నిర్వహణలోనూ పొరపాట్లు జరకుండా చూసుకుంటామని తెలిపారు. అక్రమాలు జరిగియా? లేదా? అన్నదానిపై స్పష్టత ఇవ్వకుండా కప్పిపుచ్చే దిశగా ఈవో వివరణ ఇచ్చినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. ఆలయం నుంచి 60 కోడెలు తెచ్చానని రాంబాబే స్వయంగా చెప్పినట్టు గీసుగొండ సీఐ తెలిపారు. అందులో 49 లేవని, 11 మాత్రమే ఉన్నాయని అందుకే కేసు నమోదు చేశామని వెల్లడించారు. ఆలయ అధికారులు చెప్తున్నదానికి, పోలీసులు చెప్తున్న విషయాలకు పొంతన లేకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసును లోతుగా విచారిస్తే అక్రమాలు మొత్తం బహిర్గతమయ్యే అవకాశం ఉన్నా పోలీసులను ముందుకు వెళ్లకుండా తెర వెనుక కొందరు ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. అందుకే ఆలయ అధికారులు, పోలీసులు వేర్వేరు సమాచారం బయటకు ఇస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.



రాంబాబుకు అర్జీపై మంత్రి కొండా సురేఖ చేసిన ఎండార్స్‌మెంట్ లేఖ

జనవరిలోనూ అక్రమాలు

వేములవాడ రాజన్నకు భక్తులు సమర్పించిన నిజ కోడెలను గోశాలలకు అందజేసే విధానం ఉన్నది. గోశాల ఫెడరేషన్ ద్వారా గుర్తింపు పొందిన గోశాలకు గతంలో రాజన్న ఆలయ అధికారులు కోడెలు అందజేశారు. గత జనవరిలో రాజన్న గోశాల నుంచి మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం దుబ్బ తండాలోని శ్రీ సోమేశ్వర గోసంరక్షణ సేవా సంఘానికి 20 రాజన్న కోడెలు అందించారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ పరిధిలో తనిఖీలు చేయగా 24 కోడెలు వెలుగు చూశాయి. ఆలయం నుంచి 20 మాత్రమే అందిచినట్టు లేఖలో ఉన్నా, నాలుగు అదనంగా ఉండడాన్ని గమనించిన పోలీసులు రాజన్న ఆలయ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో రాజన్న ఆలయ గోశాలలోనే అక్రమాలు జరుగుతున్నట్టు గుర్తించి గోశాల ఉద్యోగిపై కేసు నమోదు చేశారు. రాజన్న కోడెలు తరలి వెళ్తున్న శ్రీ సోమేశ్వర గోసంరక్షణ సేవా సంఘం కూడా లేనేలేదని, తప్పుడు లేఖలతో కోడెలు బయటికి తరలుతున్నాయని నిర్ధారించిన ఆలయ అధికారులు, గోశాలలకు కోడెలను అందించడం నిలిపివేశారు.

మార్చి నుంచి నేరుగా రైతులకే

అక్రమాలు జరగకుండా ఉండేందుకు మార్చి నుంచి నేరుగా రైతులకే కోడెలు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి తీసుకోవాల్సిన విధివిధానాలపై రాజన్న ఆలయ అధికారులతో చర్చించారు. కలెక్టర్, జిల్లా పశు వైద్యాధికారి, జిల్లా వ్యవసాయ అధికారితోపాటు ఇతర స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులతో కలిసి కమిటీ వేశారు. కోడెలను తమ అవసరాలకు తీసుకెళ్లడానికి ఎవరు వస్తారో.. సదరు వ్యక్తి కచ్చితంగా రైతు అయి ఉండాలని, అతనికి సంబంధించి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, వ్యవసాయ అధికారి ధ్రువీకరణ పత్రంతో ముందుగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించి ఒక్కో రైతుకు కేవలం రెండు కోడెలు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. నవంబర్ 14 వరకు రాజన్న ఆలయం నుంచి రైతుల పేరిట 1,734 కోడెలను పంపిణీ చేసినట్టు ఆలయ రికార్డులు చెప్తున్నాయి.

ఒక్కడికే 60 కోడెలు?

రాజన్న కోడెలను రైతులకు మాత్రమే, అదీ రెండే ఇవ్వాలన్న నిబంధన ఉన్నా రాంబాబుకు 60 కోడెలు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి అనుచరుడు, పైగా మంత్రి సిఫారసు లేఖ ఉన్నందునే ఒక్కరికే గంపగుత్తగా కోడెలు కట్టబెట్టారన్న ఆరోపణలు వస్తున్నాయి. కాగా రికార్డుల్లో మాత్రం వరంగల్ జిల్లాకు చెందిన వివిధ గ్రామాల రైతులు వచ్చి కోడెలు తీసుకెళ్లినట్టు పేర్కొనడం గమనార్హం. రైతుల పేర్లను బినామీగా వాడుకొని సదరు వ్యక్తి రాంబాబు కోడెల క్రయవిక్రయాల వ్యాపారం చేస్తున్నట్టు తెలుస్తున్నది. ప్రభుత్వ ఉదాసీన వైఖరి, అధికారుల నిర్లక్ష్యం, అక్రమాల వల్లే కోడెల పంపిణీ వ్యవస్థ పక్కదారి పట్టినట్టు తాజా ఘటన బట్టి స్పష్టమవుతున్నది.

హోంగార్డుల దినభత్యం పెంపు

- సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని హోంగార్డుల దినభత్యాన్ని రూ.921 నుంచి రూ. వెయ్యికి పెంచుతున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హోంశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన విజయోత్సవ వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ , ఎమర్జెన్సీ రెస్పాన్స్‌కు సంబంధించిన కొత్త వాహనాలు, రాష్ట్ర విపత్తు దళానికి చెందిన బోట్లను ప్రారంభించారు. ఎస్డీఆర్ఎఫ్ నూతన లోగోను ఆవిష్కరించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం తాత్కాలిక పద్ధతిలో ఎంపిక చేసిన ట్రాన్స్‌జెండర్లకు ఎన్‌రోల్‌మెంట్ పత్రాలను అందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. హోంగార్డ్స్ రైజింగ్ డే సందర్భంగా హోంగార్డుల దినభత్యాన్ని పెంచడంతో పాటు వీక్లీ పరేడ్ అలవెన్స్‌ను రూ.200కు పెంచుతున్నట్టు ప్రకటించారు. మరణిస్తే రూ.5 లక్షల పరిహారం ఇస్తామని చెప్పారు. వీటిని జనవరి నుంచి అమలు చేస్తామని తెలిపారు.

పెద్దపల్లి ఎంపీ ఎన్నిక చెల్లదంటూ పిటిషన్

పెద్దపల్లి, డిసెంబర్ 6(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గోదావరిఖనికి చెందిన న్యాయవాది పులిపాక రాజ్‌కుమార్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అయితే, తన నామినేషన్ చెల్లదంటూ అకారణంగా తిరస్కరించారని ఆరోపిస్తూ రిటర్నింగ్ అధికారి, ఎంపీ వంశీకృష్ణ, ఎన్నికల సంఘాన్ని బాధ్యులను చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

రాష్ట్రానికి 7 నవోదయ విద్యాలయాలు

కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటుచేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ డిమాండ్‌కు కేంద్రం ఎట్టకేలకు దిగివచ్చింది. తెలంగాణలో కొత్తగా 7 నవోదయ పాఠశాలలు ఏర్పాటుచేయాలని కేం ద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 9 జవహర్ నవోదయ పాఠశాలలు ఉండగా, కొత్తవాటితో కలిపితే వాటి సంఖ్య 16కు చేరనున్నది. జగిత్యాల, నిజామాబాద్, భద్రాద్రికొత్తగూడెం, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, సూర్యాపేట జిల్లాల్లో కొత్త స్కూళ్లను ఏర్పాటు చేయనున్నారు.

85 కేవీలు, 28 జేఎన్‌వీలు..

కేంద్ర క్యాబినెట్ నిర్ణయం మేరకు దేశవ్యాప్తంగా కొత్తగా 85 కేంద్రీయ విద్యాలయాలు, 28 నవోదయ పాఠశాలలు ఏర్పాటుచేయనున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1256 కేవీలు ఉండగా, కొత్తవి 85 కలిపి వాటి సంఖ్య 1341కి చేరనున్నది. ఇక నవోదయ పాఠశాలలు ఇప్పటికే 661 ఉండగా కొత్తవి 28 కలిపితే మొత్తం 689 కానున్నాయి.

నాలుగు డైట్ కాలేజీలు..

రాష్ట్రానికి కొత్తగా నాలుగు డైట్ కాలేజీలు మంజూరైనట్టు ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్ వెల్లడించారు. రాష్ట్రంలోని ఏడు జోన్లలో ఇప్పటికే 10 డైట్ కాలేజీలు ఉండగా, మరో నాలుగు ఏర్పాటు చేయనున్నట్టు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని కాళేశ్వరం జోన్లలో నెలకొల్పనున్నట్టు పేర్కొన్నారు.

గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదు

మెయిన్ పరీక్షల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు చేయడం కుదరదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. అభ్యర్థుల అభ్యంతరాలను పక్కన పెట్టి మెయిన్ పరీక్షల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. గ్రూప్-1 నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, మెయిన్ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 2022లో ఇచ్చిన గ్రూప్-1 నోటిఫికేషన్‌ను పక్కన పెట్టి 2024లో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయడం చట్ట విరుద్ధమంటూ గతంలో తెలంగాణ హైకోర్టులో కొంతమంది అభ్యర్థులు పిటిషన్ దాఖలు చేశారు. అలాగే 2024 గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షల్లో కూడా 14తప్పులున్నాయని, మెయిన్‌ను వాయిదా వేయాలని కూడా అభ్యర్థులు కోరారు. వీటిపై విచారణ జరిపిన జస్టిస్ పీఎస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం తీర్పు వెల్లడించింది. కోర్టును ఆశ్రయించిన అభ్యర్థులు ఎవరూ ప్రిలిమ్స్ పరీక్షల్లో అర్హులు కానందున మెయిన్ వాయిదా వేయాల్సిన అవసరం లేదని ధర్మాసనం పేర్కొన్నది. పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమని అభిప్రాయం వ్యక్తం చేసిన ధర్మాసనం, తమ జోక్యం వల్ల ఉద్యోగ నియామకాల ప్రక్రియలో తీవ్ర జాప్యం అవుతుందని కూడా అభిప్రాయపడింది.